
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్టం 32.0, కనిష్టం 23.4



నిజామాబాద్
జిల్లా వార్తలు

5

ఆదివారం 24 ఆగస్టు 2025

ఆటలకు వేళాయే..

» నేటి నుంచి జాతీయ క్రీడా దినోత్సవాలు

సుభాష్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడలు, యువజన శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 24 నుంచి 31 వరకు జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు క్రీడల అభివృద్ధి అధికారి పవన్‌కుమార్ శనివారం తెలి పారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలో వివిధ అంశాల్లో పోటీలు, క్రీడల ప్రాముఖ్యతను, ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

చెన్నై టూ ఇండూర్



» భవానీపేట్‌లో వాలిన అనుమానాస్పద పావురం
» పక్షి కాళ్లకు కోడ్ అక్షరాలతో రింగులు
» రేసింగ్ బర్డ్‌గా గుర్తించిన పోలీసులు
» చెన్నై రేసింగ్ క్లబ్‌కు చెందినదిగా అనుమానం

బైకు రేస్, కార్ల రేస్ తెలుసు. గుర్రాల రేస్ తెలుసు. పావురాల రేస్ గురించి తెలుసా? ఇది, వందల ఏళ్లనాటి క్రీడ. నిజాం కాలంలో ఇది ఉండేది. ఇది ఇప్పుడు కూడా చెన్నైలో కొనసాగుతోంది. అక్కడి నుంచి బయల్దేరిన ఓ పావురం.. అలసి ఇటీవల జిల్లాలోని బోధన్ మండలంలోని భవానీపేట్ గ్రామానికి చేరింది. అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్న పావురాన్ని గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు పావురాన్ని స్వాధీనం చేసుకున్నారు. దానిని చూసిన స్థానికులు అది రేసింగ్ పావురంగా గుర్తించి, జిల్లాలో ఎన్నో ఏళ్ల క్రితం కనుమరుగైన పావురాల పోటీలను గుర్తు చేసుకున్నారు.



పందేనికి సంబంధించిన కోడ్

సండే స్పెషల్ SUNDAY SPECIAL

నిజామాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కొన్ని వందల ఏళ్ల కిందట పావురాల పోటీ ఉండేది. బోధన్ మండలంలో గత మంగళవారం చోటు చేసుకున్న సంఘటనతో నిజాం కాలంలోని పోటీలు మళ్లీ తెరపైకి వచ్చాయి. బోధన్ మండలంలోని భవానీపేట్ గ్రామంలో ఓ పావురం అస్వస్థతకు గురై ఓ బాలుడికి దొరికింది. స్థానికులు పావురం కాళ్లకు ఉన్న రింగ్‌లు చూసి ఆశ్చర్యపోయారు. పోలీసులకు చూపించగా అది రేసింగ్‌కు సంబంధించిన పావురంగా గుర్తించారు.

పందెం ఇలా...

పందెంలో పాల్గొనే ప్రతీ పావురానికి రింగ్ నంబర్లు, కేటగీరీలు ఉంటాయి. రేసింగ్‌లో పాల్గొనే పావురాలను ముందుగా రేసింగ్ ప్రారంభించే ప్రదేశానికి తీసుకెళ్తారు. ఆయా పావురాలకు ఉదయమే మంచినీరు తాగించి వదిలేస్తారు. రేసింగ్‌లో పాల్గొన్న పావురాల యజమానుల ఇళ్లలో రిఫరీలు ఉంటారు. పావురం ఏ సమయానికి వచ్చిందో చూసి దూరాన్ని బట్టి వేగాన్ని గుర్తిస్తారు. ముందుగా చేరుకున్న పావురాన్ని విజేతగా నిర్ణయిస్తారు. ఎంత దూరంలో వదిలేసినా... ఇవి ఇంటికి తిరిగి వచ్చేస్తాయి. వాటికి కావాల్సిందల్లా వాటికి దారి చూపే టెక్నిక్ మాత్రమే.. కొన్నిసార్లు యేడాది తర్వాత కూడా ఇంటికి తిరిగి రావచ్చు. కాగా ప్రస్తుతం నిర్వహించే రేసింగ్‌లో కుతుబ్‌షాహీల కాలంలో ఉన్న నిబంధనలే ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

రేసర్లు పావురాల రేసింగ్‌లో పాల్గొనేవారు కచ్చితంగా పావురాల ప్రేమికులు అయి ఉండాలనే నిబంధన ఉంది. వెయ్యి నుంచి 1500 కిలోమీటర్ల వరకు రేసింగ్ నిర్వహిస్తుంటారు. మూడు నెలల వయసు నుంచే ట్రైనింగ్‌ను ప్రారంభిస్తారు. అలా యేడాదిపాటు ఇంటి చుట్టూ తిప్పుతారు.

పావురాలు రేసింగ్‌కు పనికి వస్తాయా? లేదా అన్న విషయాన్ని ఆయా పావురాల కళ్లను చూసి చెబుతారు. రేసింగ్‌లో పాల్గొనే పావురాలకు పది రకాల ధాన్యాలు, జొన్నలు, మొక్క జొన్నలతోపాటుగా మల్టీ విటమిన్ టాబ్లెట్లు కూడా ఇస్తారు. ఆయా పావురాలకు సంబంధించి రెండు రింగ్‌లను కాళ్లకు తగిలిస్తారు. ఒకటి క్లబ్‌కు సంబంధించినవి, ఇంకోటి పావురం వయస్సుకు సంబంధించినది. కాగా వాటిలో ఓనర్లకు సంబంధించిన వివరాలు ఉంటాయి.


పందెం పక్షి


కాళ్లకు ఉన్న రింగులు

రేసింగ్‌లో రారాజులు..

పావురాల రేసింగ్‌లకు సంబంధించి ప్రత్యేకంగా క్లబ్‌లు కూడా ఉన్నాయి. పావురాల ఓనర్స్‌ని ఫాన్సీయస్ అంటారు. కొందరు ఈ పావురాల రేస్‌లను హాబీగా ఎంచుకుంటారు. ఆయా పావురాల్లో అనేక జాతులు ఉన్నటికీ తుగిడి, హోమర్, టంబ్లర్‌లు రేసింగ్‌కు అనుకూలంగా ఉంటాయి. హోమర్ డిస్టెన్స్ రేస్‌లో పాల్గొంటే, టంబ్లర్ తన ఓర్పును తట్టిచూడమంటుంది. ఇక తుగిడి గుంపుల పోటీలో ఇది చాలా యాక్టివ్‌గా ఉంటుంది. నిజాం కాలం తర్వాత కనుమరుగైన ఈ పావురాల రేసింగ్ హైదరాబాద్‌తో పాటు, బెంగుళూరు, చైన్నై, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో ప్రస్తుతం చాలా పాపులర్. హైదరాబాద్ క్లబ్ వారు నిర్వహించే రేసింగ్‌లకు ఆదిలాబాద్, నిర్మల్, బోపాల్ వంటి ప్రదేశాలు ఎంచుకుంటారు. ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన పావురాలను రేసింగ్ ప్రదేశానికి పంపుతారు.

మెడికల్ కాలేజీలో ర్యాగింగ్

» మెడికోను చితకబాదిన సీనియర్లు

నిజామాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. సుమారు పది మంది చితకబాదారు. పటాన్‌చెరుకు చెందిన రాహుల్ నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. జనరల్ హాస్పిటల్‌లో విధులు నిర్వహించినా గైర్హాజరైనట్లు సీనియర్లు రిజిస్టర్‌లో నమోదు చేశారు. ఈ విషయమై శనివారం సీనియర్ల వద్దకు వెళ్లి తాను డ్యూటీ చేసినా ఎందుకు గైరా జరు వేశారని అడిగాడు. దీంతో మమ్మల్నే నిలదీస్తావా.. అంటూ వారు మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. అర గంట పాటు ర్యాగింగ్ చేసినట్లు సమాచారం. కాగా విషయం బయటకు రాకుండా కళాశాల అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. కాంప్రమైస్‌కు విద్యార్థిపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

యాక్షన్ షురూ..

» 13 మంది బైండోవర్

సుభాష్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్ర జ్యోతి): పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల నేపథ్యంలో 13 మందిని బైండోవర్ చేసినట్లు సీపీ సాయిచైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 5, ఎడపల్లి లో 3, రుద్రూర్‌లో 3 మొత్తం 13 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. అంబులెన్స్ వెళ్లడానికి ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా గణేష్ మండపాల వద్ద దారిని వదలాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు.



'పైసా'చికం..

వడ్డీ వ్యాపారానికి అడ్డుకట్ట పడేనా ?

వడ్డీ వ్యాపారుల ఆగడాలకు.. అడ్డూ అదు పు లేకుండా పోతోంది. పోలీసులు ఎన్ని సార్లు మందలించినా తీరు మారడం లేదు. దందాకు పాల్పడుతున్న వారి ఇళ్లపై, కార్యాలయాలపై దాడులు చేస్తున్నా జిల్లాలో చాప కింద నీరులా వడ్డీ వ్యాపారం జరుగుతూనే ఉంది. డబ్బులు అవసరం ఉన్న వారి తొందరను ఆసరాగా చేసుకొని అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. తిరిగి చెల్లించని పరిస్థితుల్లో వారి ఆస్తులను రాయించుకోవడం, వేధించడం వంటి ఘటనలు జిల్లాలో జరుగుతున్నాయి.

» దందా చేస్తున్న వారి ఇళ్లపై పోలీసుల దాడులు
» శనివారం ఉదయం నుంచి కొనసాగుతున్న తనిఖీలు
» జిల్లాలో నెలకు రూ.20 కోట్ల వ్యాపారం
» నగరంలోనే సుమారు రూ.10 కోట్ల టర్నోవర్..
» రూ.10 వడ్డీతో జలగల్లా పీల్చుతున్న వైనం
» వేధింపులు తాళలేక గతంలో పలువురి బలవన్మరణం
» అధికంగా అప్పులకు ఇచ్చేది ప్రభుత్వ ఉద్యోగులే..
» గతంలోనూ ఓ కానిస్టేబుల్‌పై కేసు

నిజామాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇటీవల పోలీస్ కమిషనర్ సాయి చైతన్య 'పోలీసు ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న క్రమంలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు ఆయన దృష్టికి వచ్చాయి. దీంతో శనివారం జిల్లా వ్యాప్తంగా వడ్డీ వ్యాపారుల ఇళ్లలో, కార్యాలయాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో పెద్ద ఎత్తున ప్రాంసరీ నోట్లతో పాటు నగదును, సేల్‌డీడీలను, వాహనాల బాండ్ పేపర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. రాత్రి పొద్దు పోయే వరకు సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇదివరకు ఏప్రిల్ 17న సైతం జిల్లా వ్యాప్తంగా పోలీసులు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై, కార్యాలయాలపై దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున నగదును స్వాధీనం చేసుకున్నారు. అయినప్పటికీ జిల్లాలో వడ్డీ వ్యాపారస్తుల ఆగడాలు తగ్గడం లేదు. తక్షణ అవసరాల కోసం డబ్బు అవసరమైన వారికి అధిక వడ్డీలకు డబ్బులు ఇస్తూ తిరిగి చెల్లించని క్రమంలో వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. సమయానికి అప్పు కట్టలేక అవమానంతో అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు జరుగుతున్నాయి. జిల్లాలో పోలీసులు తరచూ వడ్డీ వ్యాపారుల ఇళ్లపై, కార్యాలయాలపై దాడులు చేస్తున్నా వారి ఆగడాలను మాత్రం తగ్గడం లేదు.

అడ్డుకట్ట పడేనా...

వడ్డీ వ్యాపారం చేయడం అనేది అనధికార చర్య. దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి ఉండదు. కానీ జిల్లాలో వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయ లుగా సాగుతోంది. పోలీసులు సైతం వడ్డీ వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోని పరిస్థితి నెలకొంది. పోలీసు లు వడ్డీ వ్యాపారుల పూర్తి సమాచారాన్ని సేకరించడంతో పాటు బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించడం ద్వారా కొంత వరకైనా ఆగడాలకు చెక్ పెట్టే అవకాశం ఉంది. రాష్ట్రంలో అనధికార రుణదానం

(తరువాయి 8వ పేజీలో...)


స్వాధీనం చేసుకున్న నగదు, డాక్యుమెంట్లు

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడులు

(వివరాలు 6వ పేజీలో....)

ఉపాధ్యాయుడి దాష్టీకం..

» విద్యార్థుల చెవులు, కళ్లలో కారం కొట్టి చితక బాదిన టీచర్
» అదేం పనని ప్రశ్నించేందుకు వెళితే కారులో పరారీ
» టీచర్‌పై దాడికి విద్యార్థుల తల్లిదండ్రుల యత్నం
» సస్పెండ్ చేయాలని గ్రామస్థుల డిమాండ్


స్కూల్‌లో విచారణ చేపట్టిన ఎంఈవో గంగాధర్

నందిపేట, ఆగస్టు, 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పాల్సిన టీచరే వారి చెవులు, కళ్లలో కారం పొడి చల్లి చితక బాదాడు. తల్లిదండ్రులు ఆ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని నిలదీసేందుకు వెళితే పరారయ్యాడు. నందిపేట మండలం ఖుద్వాన్‌పూర్ గ్రామంలో మండల ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడి పని చేస్తున్న శంకర్ సైకోగా మారాడు. అల్లరి చేస్తున్నారనే నెపంతో విద్యార్థుల చెవులు, కళ్లలో కారం పొడి చల్లాడు. అంతటితో ఆగకుండా విచక్షణ కోల్పోయి వారిని చితక బాదాడు. ఈ సంఘటన గత నాలుగు రోజుల క్రితం జరిగింది. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని ప్రశ్నించేందుకు వెళితే అప్పటి నుంచి ఆయన విధుల్లోకి రావడం లేదు. శనివారం విధుల్లోకి వచ్చిన విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆ టీచర్‌ను నిలదీసేందుకు వెళ్లారు. ఎక్కడ తనపై దాడి చేస్తారోనని గమనించిన ఆయన కారులో

(మిగతా 8వ పేజీలో....)


చైర్మన్‌ను, డైరెక్టర్‌ను సీఎంసీ వద్ద గేట్లు మూసివేసి అడ్డుకుంటున్న సిబ్బంది

'ఛీ'ఎంసీ..

క్రిస్టియన్ కళాశాల ప్రారంభంపై నీలినీడలు

ముదురుతున్న అంతర్గత పోరు

వివాదాస్పదంగా మారిన డైరెక్టర్ నియామకం

నిజామాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాకు మరో మెడికల్ కళాశాల వస్తుందనుకుంటున్న ప్రజలతో పాటు డిచ్‌పల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు ఇటీవల క్రిస్టియన్ మెడికల్ కళాశాల (సీఎంసీ) వ్యవహారం రోజు రోజుకూ ముదురుతుంది. ఇప్పటికే జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండగా గతంలో డిచ్‌పల్లి వద్ద ఉన్న సీఎంసీ మెడికల్ కళాశాలను తిరిగి ప్రారంభించే ప్రయత్నాలు జరిగే క్రమంలో జరుగుతున్న పరిణామాలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. 1911లో తెలంగాణ మిషన్‌లో భాగంగా విక్టోరియా లెప్రసీ ఆస్పత్రిగా ఉండి 1915లో పెద్ద స్థాయి ఆస్పత్రిగా సీఎంసీ ఏర్పడింది. ఆ తర్వాత 1961లో ఆసుపత్రిగా రూపాంతరం చెందింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు, సరైన పర్యవేక్షణ లేక సీఎంసీ కళాశాల మూతపడింది.

సీఎంసీ తిరిగి కళాశాలను ప్రారంభించేందుకు జరుగుతున్న ప్రయత్నాలలో అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ మెడికల్ సైన్స్ రీసెర్చ్ సెంటర్ (ఐఎంఎస్‌ఆర్)తో సీఎంసీ కళాశాల గత ఏడాది ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు ఐఎంఎస్‌ఆర్ చైర్మన్ షన్ముకలింగం శనివారం సీఎంసీ కళాశాలలోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ అడ్డుకున్నారు. ఇదివరకే సీఎంసీ కళాశాల తమదేనని పూర్తి హక్కులు తమకే ఉన్నాయని షన్ముకలింగం విలేకరుల సమావేశం నిర్వహించి తలిపారు. చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా పాలకమండలి డైరెక్టర్‌గా తనను నియమించినట్లు నగరానికి చెందిన ఐఎంఏ అధ్యక్షుడు అజ్జ శ్రీనివాస్ ప్రకటించారు. కానీ శ్రీనివాస్ ఐఎంఎస్‌ఆర్‌కు తెలియకుండానే సిబ్బందిని నియమించడంతో పాటు కళాశాల ఏర్పాటు కొరకు సామగ్రి కొనుగోలులో అక్రమాలకు పాల్పడినట్లు షన్ముకలింగం ఆరోపిస్తున్నారు. అటు ఐఎంఎస్‌ఆర్ సంస్థ సీఎంసీతో వంద కోట్ల ఒప్పందం చేసుకున్నట్లు

(మరిన్ని వివరాలు 8వ పేజీలో...)

రావొద్దు..

» సీఎంసీ చైర్మన్‌ను, డైరెక్టర్‌ను అడ్డుకున్న సిబ్బంది
» గేట్లు మూసివేసి సిబ్బంది నిరసన

8

రేపు జిల్లాకు రానున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

అర్వింద్ జన్మదిన వేడుకల్లో పాల్గొననున్న బీజేపీ చీఫ్



నిజామాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాంచందర్‌రావు సోమవారం జిల్లాకు రానున్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ సైతం ఆయనతో కలిసి శ్రీరామగార్డెన్‌లో నిర్వహించనున్న కార్యకర్తల సమ్మేళనంలో పాల్గొననున్నారు. ఇందల్వాయి నుంచి స్వాగత కార్యక్రమంతో పాటు నిజామాబాద్ నగరంలో కంఠేశ్వర్ ఆలయం నుంచి బైక్‌ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీరామ గార్డెన్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేయనున్న

(మిగతా 8వ పేజీలో....)

సడన్ ఎంట్రీ..

» మోపాల్, ముదక్‌పల్లిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
» వసతి గృహాలు, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల సందర్శన

8


వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్


కుక్కదాడిలో తీవ్రంగా గాయపడ్డ పల్లెపు అక్షర

చిన్నారిపై పిచ్చి కుక్కదాడి

● తీవ్రంగా గాయపడ్డ అక్షరను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలింపు

నందిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాజానగర్ దుబ్బా ప్రాంతంలో శనివారం ఇంటి ముందు ఆడుకుంటున్న రెండేళ్ల చిన్నారిపై పిచ్చికుక్క దాడి చేసింది. విచక్షణారహితంగా కరవడంతో చెంపలు, వీపు భాగాలపై తీవ్రంగా గాయాలైనాయి. దీన్ని గమనించిన అక్షర అమ్మమ్మ కర్రతో ఎదురు తిరగడంతో ఆ పిచ్చికుక్క చిన్నారిని వదిలింది. తీవ్రగాయాలతో ఏడుస్తున్న అక్షరను స్థానికులు చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి పరిస్థితి విషమించడంతో ప్రాథమిక చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో అక్షరను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్కలు దాడి చేయకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

పింఛన్‌లు పెంచకపోతే సీఎం రాజీనామా చేయాలి

» వికలాంగులకు పింఛన్ అందించడంలో ప్రభుత్వం విఫలం
» ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష నేత ఫామ్‌హౌస్‌కే పరిమితం
» ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపన అధ్యక్షుడు మందకృష్ణ

బోధన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు పింఛన్‌లు పెంచి ఇవ్వకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని అయేషా గార్డెన్

(తరువాయి 8వ పేజీలో....)

వేంకటేశుడికి పల్లకి సేవ

» తొర్లికొండలో ఘనంగా వేడుక
» భారీగా పాల్గొన్న భక్తజనం

నృసింహుడికి ప్రత్యేక పూజలు

» జాన్కంపేట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు
» అష్టముఖి కోనేరులో పవిత్ర స్నానాలు

8

క్రీడోత్సవాలకు విద్యార్థులను సన్నద్ధం



మాట్లాడుతున్న ఎంపీవో రాజ గంగరాం

ఆర్మూర్ , ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): అంతర్ పాఠశాల క్రీడోత్సవాలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఎంఈవో రాజగంగారాం అన్నారు. శనివారం ఆర్మూర్‌లోని ఎమ్మార్సీలో ప్రధానోపాధ్యాయులకు, క్రీడ ఉపాధ్యాయులకు అంతర్ పాఠశాల క్రీడోత్సవాల నిర్వహనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం అంతర్ పాఠశాలల క్రీడా తేదీలను ఖరారు చేశామని వచ్చేనెల 10, 11, 12 తేదీలలో అర్బన్ క్రీడలు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. అదే విధంగా వచ్చేనెల 15, 16, 17 తేదీలలో మండల రూరల్ క్రీడలు చేపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. పోటీల నిర్వహణకు అర్బన్ క్రీడల కన్వీనర్‌గా లక్ష్మీనర్సయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మల్లేష్‌గౌడ్, రూరల్ క్రీడల కన్వీనర్‌గా చేతన కుమారి, ఆర్గనైజర్ సెక్రటరీగా గంగాధర్ బాధ్యతలు నిర్వహిస్తారని ఎంఈవో తెలిపారు.

వేణు నియామకం పట్ల హర్షం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ పోల్కం వేణును నియామకం చేయడంతో పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా పోల్కం వేణు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా నియామకం చేసినందుకు ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి, పెద్దోల్ల గంగారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపి కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్తానని ఆయన తెలిపారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడులు

- రూ. కోటి 21 లక్షల 92వేల 750 స్వాధీనం
- భారీగా ప్రాంసరీ నోట్లు, చెక్కులు, బాండ్ పేపర్లు లభ్యం

నిజామాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పోలీసులు అక్రమ వడ్డీ వ్యాపారులపై శనివారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా, రిజిస్ట్రేషన్ సైతం లేకుండా అనేకమంది అక్రమంగా ఫైనాన్స్‌లు ఏర్పడి ఇలా అక్రమ వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నారని ఫిర్యాదుల మేరకు ఈ దాడులు జరిపారు. సామన్య పేద కుటుంబాలకు చెందిన వారి అవసరాలను ఆసరాగా చేసుకొని ఫైనాన్స్ పేరుతో వారి వద్ద నుండి అధిక వడ్డీలు వసూలు చేస్తూ వీరిని ఆర్థికంగా మరింత ఇబ్బందులకు గురి చేస్తున్న ఈ అక్రమ వడ్డీ వ్యాపారులపై కఠినచర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య హెచ్చరించారు. ఈ సందర్భంగా లభ్యమైన పూర్తి వివరాలు వెల్లడించారు. చెక్కులు నిజామాబాదులో 137, వాటి విలువ రూ.10,14,11,370 ఆర్మూర్‌లో 62, వాటి విలువ రూ.30,36,000 ప్రామిసరీ నోట్లు నిజామాబాదులో 170, వాటి విలువ రూ.7,10,73,870 ఆర్మూర్ లో 324, వాటి విలువ రూ. 4,97,10,000. బాండ్ పేపర్లు ఆర్మూర్‌లో 49, వాటి విలువ రూ. 1,85,30,500, ల్యాండ్ డాక్యుమెంట్లు నిజామాబాదులో 99, ఆర్మూర్‌లో 5, నిజామాబాదులో నగదు మొత్తం రూపాయలు రూ.1,21,92,750 స్వాధీనం చేసుకున్నట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు.

క్రైం సమాచారం

గుట్కా, హుక్కాలపై పోలీసుల ఉక్కుపాదం: ఎస్పీ



పట్టుకున్న గుట్కా, హుక్కా

కామారెడ్డిటౌన్,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుట్కా, హుక్కా అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. శనివారం సాయంత్రం కామారెడ్డి పట్టణంలో విశ్వసనీయ సమా చారం మేరకు సిరిసిల్ల రోడ్డులోని ఎంఎం పాన్ షాప్‌పై ఏఎస్పీ చైతన్యరెడ్డి పర్యావేక్షణలో సీఐ నరహరి దాడి చేసి చట్టవ్యతిరేకమైన హుక్కాకు సంబంధించిన పలురకాల పరికరాలు, మత్తు పదార్థాలు, నిషేదిత గుట్కాల ను స్వాధీనం చేసుకున్నామన్నారు. మైనర్ పిల్లలను, యువకులను టార్గెట్ చేసి వారికి గుట్కా, హుక్కాను అలవాటు చేసి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేస్తూ అధిక సోమ్మును అర్జిస్తున్న కామారెడ్డికి చెందిన మహమ్మద్ సల్మాన్‌ఖాన్, మహమ్మద్ ఇబ్రహీంఖాన్, మహమ్మద్ జాకీర్ హుస్సైన్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. కామారె డ్డి జిల్లాలో ఈ తరహా నేరం చేయడానికి యత్నించిన, నేరానికి పాల్పడిన వారిని పట్టుకోవడంతో పాటుగా వారిని కోర్టులో ప్రవేశపెట్టి శిక్షలు పడేవిధంగా చేస్తామని హెచ్చరించారు. ఆపద సమయంలో గానీ, అనుమానితులు కనిపించిన సమయంలో గానీ , నేరం జరిగిన వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారాన్ని తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కామారెడ్డి పట్టణంలో హుక్కా, గుట్కాలను, వాటి పరికరాలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నరహరి, ఎస్సై నరేష్, శ్రీరాం,సిబ్బందిని ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

భర్త చేతిలో భార్య హత్య..

- సదాశివనగర్‌లో ఘటన ● క్లూస్ టీం వివరాల సేకరణ



లింగవ్వ(ఫైల్)

సదాశివనగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలకేంద్రం లోని జ్యోతినగర్ కాలనీకి చెందిన చిందం లక్ష్మీ అలియాస్ లింగవ్వ(40) శుక్రవారం అర్ధరాత్రి హత్యకు గురైనట్లు ఎస్సై పుష్పరాజ్ శనివారం తెలిపారు. పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో ఘటన జరిగిన రాత్రి మృతురాలి భర్త రవి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య వంట చేస్తుండగా దంపతుల మధ్య తగువు చోటుచేసుకుంది. ఆ సమయంలో భార్య భర్తను కొట్టిన కారణంగా కోపానికి గురైన మృతురాలి భర్త ర వి సమీ పంలో ఉన్న రాయితో భార్యపై దాడి చేయగా ఆమె అక్కడిక్కడే తీవ్రగా యాలతో మృతి చెందినట్లు నిర్ధారించడం జరిగిందన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారని, పెద్దకుమారుడు సురేష్ హైదరాబాద్‌లో ఉండగా, చిన్న కుమారుడు మహేష్ దుబాయ్‌లో ఉన్నారని తెలిపారు. ఈ సంఘటన సమాచారం కొడుకులకు అందజేయడం జరిగిందని తెలిపారు. సంఘటన స్థలానికి సీఐ సంతోస్‌కుమార్ హాజరై క్లూస్ టీం ద్వారా ఫోటోగ్రఫీ, ఆధారాల సేకరణ జరిపి మృతదేహాన్ని అధికారిక ప్రక్రియల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి యువకుడి ఆత్మహత్య

నిజాంసాగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): 30 సంవత్సరాల యువకుడు శనివారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజాంసాగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి పిట్ల మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన గైని పండరి (30) సంవత్సరాలు, సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టును తిలకించడానికి వచ్చిన పండరి గుల్గస్తి గార్డెన్ వద్ద సిమెంట్ రైలింగ్ పై నుండి నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గైని పండరి మృతదేహం పైకి తేలలేదని ఎస్సై తెలిపారు. గ్రామం నుంచి వచ్చి బైక్ తాళం చేయి రైలింగ్ వద్దనే ఉంచి పోలీసులు ఇరిగేషన్ సిబ్బంది చూస్తుండగానే ప్రాజెక్టులో దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ సంఘటన తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రాజెక్టులు చేరుకొని బోరున విలపిస్తున్నారు. పండరి తండ్రి హనుమాన్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఆదివారం ఉదయం శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా హాస్పిటల్‌కి తరలిస్తామని ఆయన తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అవాంతరాలు రాకుండా జాగ్రత్త పడాలి

- జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్‌నాథ్



మోతె ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ

వేల్పూర్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు జరుగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త పడాలని జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్‌నాథ్ సూచించారు. మండలంలోని మోతె గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సుమారు కోటి రూపాయల విలువగల 8.0 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఎస్ఈ రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామ సబ్‌స్టేషన్‌లో రెండు 5.0 పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నప్పటికి ఓవర్‌లోడ్ ఉన్నందున విద్యుత్ సరఫరాలో లో వోల్టేజి ఇతర సమస్యలు తలెత్తాయన్నారు. విడిసి సభ్యులతో పాటు తమ శాఖ అధికారులు ఈ సమస్యను తమ దృష్టికి తేవడంతో సీఎండీ కు తెలపడం జరిగిందన్నారు. దీంతో 8.0 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కావడం విడిసి సభ్యులు సహకారం వల్ల తమ సిబ్బంది ప్రత్యేక చొరవతో వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించడం జరిగిందన్నారు. శనివారం దాని ద్వారా కరెంట్ సరఫరా ను ప్రారంభించడం తనకు సంతోషంగా ఉందని, అందుకు విడిసి సభ్యులను అభినందించారు. ఈ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ను ఏర్పాటు చేయడం వల్ల ఇకనుంచి విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. విడిసి సభ్యులు కోరిక మేరకు సుమారు రూ. 20 లక్షల విలువగల అదనపు ఫీడర్ ను సాధ్యమైనంత త్వరగా మంజూరు చేయిస్తానని ఎస్ఈ హామి ఇచ్చారు. తాము ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను త్వరగా పరిష్కరించిన వరంగల్ సీఎండి, ఎస్ఈ, డీఈ, ఏఈ ట్రాన్స్‌కో సిబ్బందికి విడిసి సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతూ వారిని శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ట్రాన్స్‌కో డీఈ రాజేశ్వర్‌రావు, భీమ్‌గల్ ఏడీఈ వినోద్ కుమార్, ఏఈ యశ్వంత్, విద్యుత్ శాఖ సిబ్బంది, విడిసి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సేవలను అందించాలి



పీసీసీ అధ్యక్షుడికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

భీమ్‌గల్ , ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని 100 పడకల ఆసుపత్రి పనులను పూర్తి చేసి ప్రజలకు వైద్య సదుపాయాలను అందుబాటులోకి తేవాలని కోరుతూ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌తో కలిసి పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు హైదరాబాద్‌లోని తన నివాసంలో వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొదిరి స్వామి, పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రమేష్, కార్యదర్శి బోజగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల లక్ష్మణ్, ముచ్కూర్ సొసైటీ చైర్మన్ బంగ్లా దేవేందర్, పిట్ల శీను, ఏఎంసీ డైరెక్టర్ జీవన్, భీమ్‌గల్ విలేజ్ కమిటి అధ్యక్షుడు నీలం రవి, తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ న్యాయాధికారి ఉదయ భాస్కర్‌రావు



మాట్లాడుతున్న న్యాయాధికారి

జక్రాన్‌పల్లి, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఉదయభాస్కర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని తొర్లికొండ గ్రామంలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఉదయ భాస్కర్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో విడిసిల ఆగడాలను అరికట్టేందుకు న్యాయచైతన్య సదస్సులను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామాలల్లో విడిసిలను రద్దు చేసుకోవాలన్నారు. చట్టాలను చేతుల్లోకి తీసుకుని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే వారిటి చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. జిల్లా న్యాయసేవా అధికర సంస్థ ఆధ్వర్యంలో ప్రజల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయ సహకారాన్ని ఉచితంగా అందిస్తామన్నారు. తొర్లికొండలో ప్రభుత్వ స్థలాల్లో 34 సెటర్లు , రూంలు నిర్మించారని వీటికి సంబంధించి నెలనెల రూం అద్దె డబ్బులు విడిసి అనుభవిస్తుందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో విడిసిలు జోక్యం చేసుకోరాదని సూచించారు. వీటిని నిర్మించిన విడిసికి ఎప్పటిలోగా నోటీసులు ఇస్తారని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఉదయ భాస్కర్‌రావు కార్యదర్శి రాజేశ్వర్‌కు వివరించగా వారం రోజుల్లోగా వారికి నోటీసులను ఇస్తామనిన్యాయాధికారికి వివరించారు. గ్రామంలో ప్రజలందరు కలిసి మెలసి ఉండాలని గ్రామం అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐ వినోద్, తహసీల్దార్ కిరణ్మయి, ఎస్సై ఎండి మలిక్ రహ్మాన్, ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంఈవో శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి రాజేశ్వర్, సీనియర్ న్యాయవాదులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరి ధిలోని మామిడిపల్లిలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీజేపీ నాయకులు అందజేశారు. శనివారం మామిడిపల్లిలోని 8, 9వ వార్డులకు చెందిన పలువురులబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్‌చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండపురం చిన్నారెడ్డి, పోచంపాడ్ శ్రీను, తూర్పు రాజు,మధు, సతీష్, కిషన్, శ్రీకాంత్, సాగర్, పాల్గొన్నారు.

దివ్యాంగులకు బాధ్యతగా సేవా చేయాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి అశోక్

ఆర్మూర్ టౌన్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బరువుగా భావించకుండా బాధ్యతగా బావించి సేవా చేయాలని జిల్లా విద్యాధికారి పార్శి అశోక్ అన్నారు. శనివారం పట్టణంలోని సీఎస్ఐ కంపౌండ్‌లో గల హెచ్‌పీడీ బదిరిల ఆశ్రమ పాఠశాలలో సమగ్ర శిక్ష సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ లిమ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా దివ్యాంగ విద్యార్థులకు సహాయ పరికరాల కోసం లబ్ధిదారుల గుర్తింపు శిబిరానికి ఆయన హాజరై మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు ఉంటాయని అన్నారు. సహిత విద్యా విభాగం ఉద్యోగులు దివ్యాంగులకు, వారి తల్లిదండ్రులకు మనోధైర్యం నింపుతూ అవగాహన కల్పించాలని అన్నారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 294 మంది దివ్యాంగ విద్యార్థులకు వివిధ సహాయ ఉపకారాలు పంపిణీ చేశామన్నారు. ఈకార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు, మండల విద్యాధికారి రాజగంగరాం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫిర్దోస్ పాతిమా, అలింకో నిపుణులు రుక్మిణి, ఓం ద్వివేది, సువర్ణకీర్తి, దమ్మి రాజన్న, లింబాద్రి స్వామి, శేఖర్, జలందర్, కిషన్, ఆనంద్, రాజ నర్సయ్య, ప్రేమ స్వరూప, శైలజ, రమాదేవి, స్పెషల్ టీచర్లు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సాలూర,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ ఏఎస్ఐ ఆశన్న అన్నారు. శనివారం సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ సమాజంలో అనేక నేరాలు, సంఘ వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాలూర మండల విద్యాశాఖ అధికారిణి రాజీ మంజూష, ఉపాధ్యాయులు పురాణే విజయ్ కుమార్, విఠల్ కాంబ్లే, స్వామి, లక్ష్మి, విజయలక్ష్మి, అరుణ్ కుమార్ , సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మహాగర్జనకు వెళ్లిన వృద్ధులు, దివ్యాంగులు

కోటగిరి,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మహగర్జన సభకు పొతంగల్ మండలం నుండి వృద్ధులు, వికలాంగులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాదవ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పింఛన్‌ల పెంపును తక్షణమే అమలు చేయాలన్నారు. పింఛన్‌ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై మెట్రాలాజీ అధికారుల దాడులు

బోధన్,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): బోధన్‌లోని ఎరువుల దుకాణాలపై మెట్రాలాజీ అధికారులు దాడులు నిర్వహించారు. రెండు రోజుల క్రితం నిర్వహించిన దాడులు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. వర్షాకాలం సీజన్‌ను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారస్థులు విత్తనాలు సరఫరా చేసే సంస్థ యొక్క అడ్రస్‌లు లేకపోవడం మెట్రాలాజీ అధికారులు గుర్తించారు. నిబంధనలను పాటించని దుకాణాలను గుర్తించి ఒక్కో దుకాణినికి 25వేల రూపాయల జరిమాన విధించినట్లు తూనికల కొలతల శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్రాలాజీ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ భూలక్ష్మి, జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి సుజాత్ అలీలతో సంబంధిత అధికారులు, తదితరులున్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం: ఏసీపీ

ఆర్మూర్ , ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిల దైనందిన జీవితంలో చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్మూర్‌లోని విజయ్ హైస్కూల్‌లో ఇంట్రామ్యూరల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ప్రారంభోత్స కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో పాఠశాల కరస్పాండెంట్ కవితా దివాకర్, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వరిపంటను పరిశీలించిన ఏవో

నవీపేట,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ శనివారం వరిపంటను మండల వ్యవసాయ శాఖ అధికారి నవీన్ కుమార్ పరిశీలించారు. పలు చోట్ల వరిపంటకు సోకిన బ్యాక్టిరియా, ఎండాకు తెగులు నివారణకు రైతులకు తగిన సలహలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వినోద్, రైతులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

నవీపేట,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న డీలర్లపై తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం సభ్యులు శనివారం నాయబ్ తహసీల్దార్ రంజిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ సింగ్, ఒడ్డెన్న, పోశెట్టి, రాజయ్య ఉన్నారు.

ఉమ్మడి మండల బడ్జెట్ స్కూల్ అసోసియేషన్ ఎన్నిక

ముప్కాల్ ,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి బాల్కొండ మండల బడ్జెట్ స్కూల్ అసోసియేషన్ డివిజన్ బాడి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాల్కొండ ఉమ్మడి మండల ప్రైవేట్ స్కూల్ అధ్యక్షునిగా లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ సత్యనారాయణ, సెక్రటరీగా న్యూ హరిజోన్స్ స్కూల్ కరస్పాండెంట్ భూస రత్నాకర్, కోశాధికారిగా లిటిల్ ఫ్లవర్ హాజమత్ పాషాను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్‌బాడి పాషా, గిరి, రవీందర్, హరీష్, కరస్పాండెంట్ పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరి మృతి

మోర్తాడ్,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ బీసీ కాలనీకి చెందిన చేని గోపాల్(42) అనే వ్యక్తి ఉరివేసుకుని చనిపోయాడని ఎస్సై బి. రాము తెలిపారు. శనివారం ఉదయం మృతుడు రైల్వే స్టేషన్‌కు కొద్ది దూరంలో చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడని తెలిపారు. మృతుడు టీవీఎస్ ఎక్సెల్ పై ఇంటింటికి తిరుగుతూ పూసలు, ఫోటోలు అమ్ముకు నేవాడని, వ్యాపారంలో నష్టం రావడంతో కొద్ది రోజులుగా ఇంటివద్ద ఉండి బాధపడుతూ ఉండేవాడని ఎస్సై తెలిపారు. ఉదయం 8 గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపాడు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మోర్తాడ్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా సాయన్న

మోర్తాడ్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి):మోర్తాడ్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగాసాయన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శని వారం మాజీ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు భూమాగౌడ్ అధ్యక్ష తన జరిగిన సమావేశంలో ప్రెస్‌క్లబ్ ఎన్నికలు జరిగా యి. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా సాయన్న, ఉపాధ్యక్షుడు కడారి రవి,కార్యదర్శి సురేష్, కోశాధికారి విజయ్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సాదిక్ , సలహాదారుడిగా ఎన్. చంద్రశేఖర్, ఉమాగౌడ్, సురేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కోనాసమందర్‌లో ఉచిత వైద్యశిబిరం

కమ్మర్‌పల్లి, ఆగస్టు 23:(ఆంధ్రజ్యోతి) మండలం లోని కోనాసమందర్‌లో శనివారం చౌట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి అద్వర్యంలో ఉచిత వైద్యఆరోగ్యశిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది వివిధ రకాల పరీ క్షలు నిర్వహించి ఉచిత మదులు అందజేశారు. అనం తరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతు సిజనల్ వ్యా ధులు వ్యాపించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివ రిస్తు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తిరణ అధికారి సత్యనా రాయణ, దుర్గ, అమృత గ్రామకార్యదర్శి అశావర్కర్‌లు పాల్గొన్నారు.

శోభాయాత్ర మార్గాన్ని పరిశీలన

నవీపేట,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వినాయక శోభాయాత్ర జరిగే మార్గాన్ని శనివారం అధికారులు పరిశీలించారు. శోభాయాత్ర మార్గంలో పలుచోట్ల ఉన్న విద్యుత్, కేబుల్ వైర్లతో పాటు చెట్ల కొమ్మలు, ఇతర అడ్డంకులను తొలగించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి, ఏఈ ఆనంద్ కుమార్, ఎస్ఐ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ట్రాక్టర్‌కు చెత్తను అందజేయాలి



తడి పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆర్మూర్ టౌన్, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రతీ ఒక్కరు రోడ్డుపైన చెత్త వేయకుండా మున్సిపల్ ట్రాక్టర్‌కు అందజేయాలని సానిటరి ఇన్‌స్పెక్టర్ నరేందర్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 9, 22వ వార్డులలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తడి పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ పూర్ణ మౌళి, హెల్త్ అసిస్టెంట్ సురేష్, వార్డు ఆఫీసర్లు రాజు, ప్రశాంత్, సానిటరీ జవాన్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

సీపీఎస్ అంతం తపస్ పంతం



మోస్రాలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మోస్రా/రుద్రూరు/బోధన్/కమ్మర్‌పల్లి,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి):తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ ఆధ్వర్యంలో మోస్రా చందూర్ మండలాల్లో తహసీల్దార్ రాజశేఖర్, వీర్‌సింగ్‌లకు సీపీఎస్ విద్రోహ దినం సందర్భంగా సీపీఎస్ అంతం గతంలో మాదిరిగా పెన్షన్ అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. మండలాల్లోని పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ యూనియన్ అధ్యక్షులు గాండ్ల మోహన్, మండల కార్యదర్శి హరికృష్ణ, రాష్ట్ర బాధ్యుడు గాండ్ల వరప్రసాద్, మోస్రా, చందూర్ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రుద్రూర్‌లో సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పించన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయుఎస్) ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ తారాబాయికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నె శంకర్, పద్మావతి, భవాని, వనిత, సంతోషిని, గంగారాం, భగత్, శివకుమార్, గంగా శంకర్, రామాగౌడ్, హన్మాండ్లు పాల్గొన్నారు.

బోధన్‌లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పించన్ విధానాన్ని పునరుద్ధరించాలని తపస్ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో జీవో నెంబర్ 28 పత్రాలను దగ్ధం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా బాధ్యులు మహజన్ నర్సింలు, బోధన్ మండల బాధ్యులు కావళ్ల సాయిలు, కోటగిరి మండల బాధ్యులు లోగం రాజేష్, బ్రహ్మం, రమాదేవి, నాగేష్, శంకర్, గంగారాం, కిషోర్, గంగాధర్, సందీప్‌లతో తదితరులు పాల్గొన్నారు.కమ్మర్‌పల్లిలో సీపీఎస్ జీవో తెచ్చిన ఆగస్టు 23ను బ్లాక్‌డేగా అభివర్ణిస్తు శనివారం తాపస్ అద్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈకార్యక్రమంలో తాపస్ మండల శాఖ అధ్యక్షులు కిషన్‌గౌడ్, డివిజన్ కార్యదర్శి శంకర్, రవి, తాపస్ మహిళ అధ్యక్షురాలు స్వర్ణలత, పిజి హెచ్‌ఎం సాయన్న తదితర ఉపాధ్యాయులు పాలొన్నారు.

లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలి

రుద్రూరు,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండల కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిరుపేద లబ్దిదారులకు కేటాయించాలని బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ శనివారం రుద్రూర్ మండల తహసీల్దార్ తారాబాయికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్లు సున్నం సాయిలు, ప్రశాంత్ గౌడ్, సీనియర్ నాయకులు మార్కెలి ప్రకాష్ పటేల్, రుద్రూర్ మండల అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు తిమ్మాపూర్ విద్యార్థులు

మోర్తాడ్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు రితికవైష్ణవిసాయినాథ్,హర్షిలు సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని పీఈటీ సింధూజ తెలిపారు. వీరు ఈనెల 23 నుంచి 25 వరకు ఆసిఫాబాద్‌లోని గోలేటిలో ఆడతారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థి విద్యార్థినిలను ఎంఈవో సమ్మిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్ష కార్యదర్శులు మానస,గణేష్, శ్యాంలు అభినందించారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

మోర్తాడ్,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్‌లో సీఎం చిత్ర పటానికి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాలసునీల్‌కుమార్ చిత్రప టానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుంట శ్రీను, బద్దం రాజశేఖర్‌రెడ్డి, సురేష్, అనిల్, అజారుద్దిన్, గంగారెడ్డి, సాయి, గోపి, దేవేందర్, ఇందిరమ్మ కమిటి సభ్యులు అశోక్, శివారెడ్డి శంకర్, పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యకర్తకు పరామర్శ



పోచీరాంను పరామర్శిస్తున్న మందకృష్ణ మాదిగ

కోటగిరి,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోచీరాంను శనివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రమోద్, స్వామి, మైలారం బాలు, మారుతి, భూమయ్య, శంకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య



ఎడ్లను ఊరేగిస్తున్న దృశ్యం

డొంకేశ్వర్/కోటగిరి,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండల కేంద్రంలో శనివారం ఎడ్ల పొలాలఅమావాస్యను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇంట్లో మట్టితో ఎడ్లను తయారు చేసి వాటికి ప్రత్యేక పూజలు చేశారు. రామాలయంలో ఎడ్లకు ప్రత్యేక పూజలు చేసి గ్రామంలోని ప్రధాన వీదుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. ట్రాక్టర్‌తో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేయించారు. పంటలు సమృద్ధిగా పండాలని రైతులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో విడిసి క్యాషియర్‌లు మహిపాల్, సుమన్, నాగరాజు, సాయి పాల్గొన్నారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లోని పలు గ్రామాలలో శనివారం ఎడ్ల పొలాల అమావాస్యను రైతులు ఘనంగా నిర్వహించారు. రైతులు ఉదయాన్నే తమ ఎద్దులను శుభ్రం చేసి కొమ్ములకు రంగులు అది, మెడలో గజ్జెలు, పసుపు, కుంకుమ, పూల దండలతో అలంకరించారు. అడ్కాస్‌పల్లి, లక్మాపూర్, కల్లూర్, సోంపూర్ తదితర గ్రామాలలో ఆంజనేయ స్వామి ఆలయాల చుట్టు ఎద్దులతో ప్రదక్షిణలు చేయించారు. గ్రామాలలో గతంలో ఉన్నంత సందడి లేకుండా పోయింది. ఆయా గ్రామాలలో రెండు, మూడు జతల ఎద్దులు మినహా పెద్ద ఎత్తున పశువులు లేకపోవడం గమనార్హం. గ్రామాలలో పొలాల అమావాస్య ఆనవాయితీని కొనసాగించారు.

బీజేపీ మండల కార్యకర్తల సమావేశం

నవీపేట,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మండల కమిటీ సమావేశాన్ని శనివారం మండలంలోని పోతంగల్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హల్‌లో నిర్వహించారు. ఈ నెల 25న జిల్లా కేంద్రానికి రానున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచం ద్రరావు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, శ్రీధర్, శ్రీకాంత్, రాజేందర్ గౌడ్,భూషణ్, గణేష్, శ్రీనివాస్ గౌడ్, రాము, ప్రవీణ్, రాధ తదితరులు పాల్గొన్నారు.



రైతులను సన్మానిస్తున్న దృశ్యం

రైతులను ఆదరించాలి..

» వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్

సుభాష్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదరించాలని వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ అన్నా రు. తెలంగాణ ప్రభుత్వ మున్నూరు కాపు ఉద్యోగులు విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో శనివారం ఎడ్ల పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పదిమంది యువరైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించవలసిన అవసరం ఉందని అన్నారు. యువ రైతులు ముందుకు వచ్చి ఆర్గానిక్ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ముఖ్యంగా మున్నూరు కాపులు వ్యవసాయంలో జిల్లాలో అగ్రగామిగా నిలుస్తున్నారన్నారు. రైతు సోదరులను వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం కోశాధికారి ధర్మపురి సురేందర్ పటేల్, అధ్యక్షులు తోట రాజశేఖర్ పటేల్, ప్రధాన కార్యదర్శి అబాపురం రవి, ఆకుల ప్రసాద్, రేంజర్ల సురేష్, సర్వే సత్యనారాయణ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు

మెకానిక్ షెడ్డుపై నీలినీడలు

» షెడ్డు పూర్తయినా వృద్ధిలోకి రాని వాహనాల మరమ్మతులు

» టెండర్లలో జాప్యంపై వృధాగా పడి ఉన్న షెడ్డు

సుభాష్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ వాహనాల మరమ్మతుల కోసం నగర పాలక సంస్థ ఖిల్లాలోని ఫిల్టర్‌బెడ్ ప్రాంతంలో మెకానిక్ షెడ్డును నిర్మించింది. షెడ్డు పూర్తయి నెలలు గడుస్తున్నా వాహనాల మరమ్మతులు మాత్రం జరగడం లేదు. మరమ్మతుల కోసం 10 నుంచి 15 రోజుల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల మరమ్మతుల కోసం ప్రతీనెలా లక్షల్లో బిల్లులు చెల్లిస్తున్నారు. చిన్న చిన్న రిపేర్లకు సైతం వేలల్లో బిల్లులు వేస్తూ నగర పాలక సంస్థ ఆర్థికభారం పడేలా చూస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు వాహనాల రిపేర్ అయితే డ్రైవర్లు వారంతరబడి వేచి చూడాల్సిన పరిస్థితి.

మరమ్మతుల ప్రక్రియను ప్రారంభించాలి

కిరణ్, డ్రైవర్ల అసోసియేషన్ కార్యదర్శి

నగర పాలక సంస్థ పరిధిలో నిర్మించిన మరమ్మతుల షెడ్డును వృద్ధిలోకి తీసుకురావాలి. మెకానిక్‌లు వస్తే మరమ్మతులు వెంట వెంటనే జరిగి డ్రైవర్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ప్రైవేటు షెడ్‌లలో మరమ్మతులు చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



నిర్మాణం పూర్తయిన మెకానిక్ షెడ్డు



మెకానిక్ షెడ్డులో కుక్కల నివాసం

టెండర్ పూర్తికాగానే షెడ్డును ప్రారంభిస్తాం..

దిలీప్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్



మరమ్మతుల షెడ్డు నిర్మాణం పూర్తయ్యింది. మెకానిక్‌ల కోసం టెండర్లను పిలిచాం. టెండరుదారులు 4 శాతం ఎక్కువ టెండరు కోడ్ చేశారు. మళ్లీ టెండర్లను పిలిచాం. టెండర్ ప్రక్రియను పిలవగానే వాహనాల మరమ్మతుల షెడ్డును ప్రారంభిస్తాం.



సోయా పంటను పరిశీలిస్తున్న అధికారులు

పంట నష్టం నివేదికను సమర్పిస్తాం

సాలూర, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పంట నష్టం నివేదికను పైఅధికారులకు సమర్పిస్తామని మండల తహసీల్దార్ శశిభూషణ్, మండల వ్యవసాయ అధికారి శ్వేత అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీటిలో మునిగిన సోయాపంటను శనివారం సాలూర మండలం ఖాజాపూర్ వ్యవసాయ క్షేత్రాలలో పర్యటించి పరిశీలించారు. దాదాపు 250 ఎకరాలలో సోయాపంట నష్టపోయినట్లు అధికారులు స్పష్టం చేశారు. 350 ఎకరాల వరకు పంట నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టం నివేదికను డివిజన్ జిల్లా అధికార యంత్రాలు వారికి సమర్పిస్తామని తెలిపారు. రైతులు ధైర్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అనిల్, రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన దక్షిణ రైల్వే జీఎం



నిజామాబాద్ రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జీఎం

సుభాష్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రైల్వేస్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. హైదరాబాద్ డివిజన్‌లోని ముఖ్కేడ్ సికింద్రాబాద్ సెక్షన్‌లో శనివారం తనిఖీలను నిర్వహించారు. అందులో భాగంగా నిజామాబాద్ రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న పునర్వ్యవస్థీకరణ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, స్టేషన్ వెలుపలగల సెంట్రల్ లైటింగ్ ఏరియాను పరిశీలించారు. ప్రయాణికులకు అన్ని సదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వెంట వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం స్టేషన్‌లను ఆధునీకరణలో భాగంగా నిజామాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, రైల్వే కూలీలు జీఎంను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్‌కుమార్ వర్మ, నాందేడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ ప్రదీప్, లక్ష్మణ్‌రావు కాంబ్లే, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యవంతులను చేసేది కళలు



ప్రదర్శననిస్తున్న కళాకారులు

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను చైతన్యవంతులను చేసేది కళాప్రదర్శన అని జిల్లా ప్రధాన న్యాయాధికారి బీవీఎన్ భరతలక్ష్మి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ జానపద కళాదినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జానపద కళలను పరిరక్షించుకోవడం కోసం కళాకారుల కృషి మరువలేనిదని అన్నారు. కళలను వారసత్వంగా నేటితరానికి అం దించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని అన్నారు. కళాకారులు జానపద నృత్యాలు, భజన పాటలు, శాస్త్రీయ నృత్యాలు, కోలాటాలు, చిందు, యక్షగానం వంటి ప్రదర్శనలు అలరించాయి. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ్‌భాస్కర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సిర్ప లింగం అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి అబ్దుల్, అధ్యక్షుడు దాసు, సాయిబాబు, నర్సారెడ్డి, గంగాధర్, రాధాకిషన్, చంద్రశేఖర్, విజయమాల, చంద్రకళ, అంజన్న, పోశెట్టి, నాగేశ్వర్, దృశ్యన్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ వరద గేట్లు మూసివేత

» మంజీరా నుంచి 13,590 క్యూసెక్కుల వరద నీరు రాక

» ప్రధాన కాలువ ద్వారా 1800 క్యూసెక్కుల నీరు పంటలకు విడుదల

» నిజాంసాగర్ ప్రాజెక్టులో 17.802 టీఎంసీలకు 16.350 టీఎంసీల నీరు సామర్థ్యం

» మంజీరా వెంట వచ్చే నీటితో నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యాన్ని నిలువ చేస్తాం

» ఈఈ సోలోమాన్

నిజాంసాగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేది నుంచి కొనసాగిన నిజాంసాగర్ వరద గేట్లను శనివారం వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు వరదలను మూసివేశారు. ప్రాజెక్టులోనికి 13,590 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. నిజాంసాగర్ పూర్తి నీటి మట్టాన్ని ఎగువ నుంచి వచ్చే నీటితో నింపేందుకు నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1405 అడుగులకు గాను 1404 అడుగుల నీటి సామర్థ్యాన్ని నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 17.802 టీఎంసీలకు 16. 357 టీఎంసీల నీటిని నిలువ చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో 1.5 టీఎంసీల నీటిని నిలువ చేస్తే ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం నిల్వ ఉంటాయి.



ప్రధాన కాలువ 8 విడుదల కొనసాగుతున్న దృశ్యం



నిజాంసాగర్ గేట్లు మూసివేసిన దృశ్యం

ప్రధాన కాలువలో 1800 క్యూసెక్కుల వరద నీటిని సాగు గేట్ల ద్వారా విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లు మూసివేయడంతో ప్రాజెక్టు సందర్శించిన సందర్శకులకు నిరాశకు లోనయ్యారు. ఐదు రోజుల పాటు వరద గేట్ల ద్వారా 25 టీఎంసీల నీటిని మంజీరా నది లోనికి వదిలేశారు. ఈ ఏడాది ఆయకట్టు కింద వేసిన పైర్ల సాగుకు ఢోకా లేకపోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి విస్తరణలో భూ బాధితులకు న్యాయం చేస్తాం

మహమ్మద్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బోధన్-హైదరాబాద్ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులందరికీ న్యాయం జరుగుతుందని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. శనివారం మహమ్మద్‌నగర్ గ్రామ పరిధిలో భూములు కోల్పోతున్న రైతులచే తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ముందుగా రైతుల వారీగా ఎవరి భూమి ఎంతెంత కోల్పోతున్నారు, ఎవరి భూమిలో బోరు బావులు, పైప్‌లైన్లు ఉన్నాయి అనే వివరాలను సర్వే నెంబర్ల ప్రకారంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తమకు మార్కెట్‌కు అనుగుణంగా డబ్బులు చెల్లించాలని రైతులు కోరడంతో ప్రతిఒక్క రైతుకు న్యాయం జరుగుతుందని అన్నారు. పనులు ప్రారంభమై నెలలు గడుస్తున్నాయని తమకు త్వరితగతిన నష్టపరిహారం డబ్బులు అందించాలని రైతులు అన్నారు. ఈ సమావేశంలో రహదారి విస్తీరణ అధికారులు, తమసీల్దార్ సవాసింగ్, నాయబ్ తహసీల్దార్ క్రాంతి కుమార్, ఆర్ఐ పాండరి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సబ్ కలెక్టర్..

విద్యార్థులు కష్టపడి చదువులో రాణించాలని అప్పుడే జీవితంలో అనుకన్న లక్ష్యాన్ని సాధించగలుగుతామని సబ్‌కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను, ఏఏ గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారు అన్న విషయాలను హెచ్‌ఎం మధుసూదన్ రాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలు అర్థమవుతున్నాయా అని విద్యార్థులను అడిగారు. అనంతరం వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిత, తహసీల్దార్ సవాయిసింగ్, డీటీ క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.




రైతులతో మాట్లాడుతున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

భూమి సమస్య పరిష్కరించరా?

» ఐదేళ్లు గడుస్తున్నా పరిష్కరించకపోవడంతో తలెత్తుతున్న వ్యక్తిగత కక్షలు

» మ్యుటేషన్ దరఖాస్తు మాయం అయినట్లు మాజీ ఎంపీటీసీ మహిపాల్ ఆరోపణ

సదాశివనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారావుపేట్ సొసైటీ భూమి మ్యూటేషన్ కోసం ఐదేళ్లుగా గ్రామస్థుల పోరాటం చేస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామంలో వ్యక్తిగత కక్షలు పెరిగిపోతున్నాయంటూ గ్రామస్థులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు పనిచేసిన నలుగురు కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చినా ఇప్పటికీ మ్యుటేషన్ కావడం లేదు సరికదా ఫైల్ దొరకడం లేదని అధికారులు చెప్తున్నట్లు మాజీ ఎంపీటీసీ మహిపాల్ యాదవ్ పేర్కొనడం, అధికారులకు కొంత ఇబ్బందిగా పరిణమించే అవకాశం కనిపిస్తుందని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విసయమై మాజీ ఎంపీటీసీ శనివారం విలేకరులతో మాట్లాడుతూ గత మే నెలలో ధరణి పోర్టల్‌లో మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేయగా ఆ భూమి నలుగురి పేర్ల మీద ఉండటంతో నాలుగు దరఖాస్తులు చేయడం జరిగిందన్నారు. అందులో రెండు దరఖాస్తులు 0-5 గుంటల చొప్పున పది గుంటలు వేరే వ్యక్తుల వద్ద భూమి ఉందని డబుల్ రిజిస్ట్రేషన్ చేశారని రిజెక్ట్ చేశారన్నారు. మిగితా రెండు దరఖాస్తులలో ఇంకా మ్యూటేషన్ కాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే ఆర్డీవో కార్యాలయానికి పంపించామని, ఆర్డీవో కార్యాలయంలో అధికారులను అడిగితే ఇక్కడ ఒ క్కటే ఫైల్ ఉం దని ఇంకో ఫైల్ లేదని దానిని తిరిగి తహసీల్దార్ కార్యాల యం పంపించామని చెబుతున్నారని అన్నారు. తాను ఎంపీటీసీగా గెలిచినప్పటి నుంచి పోరాడుతున్న మొదట్లో రిజిస్ట్రేషన్ డాక్యూమెంట్ మాయం చేశారని, తాను ఎస్ఆర్వో కార్యాలయంలో దరఖాస్తు వెతికించి తెచ్చిన ప్ర భుత్వ భూమిని ప్రభుత్వ మ్యుటేషన్ చేసుకోవడానికి ఎందుకు అలసత్యం చేస్తుందో అర్థం కావడం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ఉన్నతాధికారులను కలిసి అసలు ధర్మారావుపేట్‌లోని సహకార సంఘానికి సంబంధించిన భూమిపై నిజానిజాలు నెగ్గ తేల్చి ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేయాలని తెలిపారు.



సింగిల్ విండో చైర్మన్ వివరణ ఇచ్చిన లెటర్

ఆయిల్ పామ్ సాగును రైతులు సద్వినియోగం చేసుకోవాలి

» కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ

కమ్మర్‌పల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆయిల్ పామ్ తోటల పెంపకానికి అనుకూలమైన నేలలు ఉన్నాయని రైతులు ముందుకు వచ్చి ఆయిల్‌పామ్ తోటలు పెంచి లాభాలు గడించాలని కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ అన్నారు. శనివారం మండలంలోని ఉప్లూర్ గ్రామంలో బద్దం చిన్నారెడ్డి తన వ్యవసాయ భూమిలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను ఆమె, స్థానిక ఏఈవో రమేష్‌తో కలిసి సందర్శించి పరిశీలించారు. ప్రస్తుతం ఈ పంట కోత దశలో ఉందన్నారు. పంట కొనుగోలుకు దళారి వ్యవస్థ లేదని, పంట కోసిన 24 గంటలలోనే పంట విక్రయించే వీలుంటుందని, ప్రకృతి వల్ల పంటకు ఏలాంటి నష్టం వాటిల్లదని, పంట క్రియ విక్రయాలు అంతా చట్టప్రకారం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ పంట దిగుబడి 4 ఏళ్ల నుంచి మొదలై 35 నుంచి 40 ఏళ్ల వరకు ప్రతీ 15 రోజులకోమారు దిగుబడి ఇస్తుందన్నారు. మొదటి నాలుగేళ్ల వరకు ఎకరాన 42 వేలు చొప్పున 16800 ప్రభుత్వ పెట్టుబడి సహాయం రూపంలో అందుతాయన్నారు. ఆయిల్ పామ్ పం ట కొనుగోలుకు ఏర్పట్ల మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు పంట సాగుకు రైతులు ముందుకు రావాలని అదనపు సమాచారం కోసం స్థానిక ఏఈవోలను సంప్రదించాలన్నారు.



ఆయిల్‌పామ్‌ను పరిశీలిస్తున్న ఏవో రమ్యశ్రీ

సమస్యల వలయంలో సిద్ధరామేశ్వర ఆలయం

» కోతుల మల మూత్ర విసర్జనతో కంపుకొడుతున్న ఆలయ పరిసరాలు

» ఇబ్బందులు ఎదుర్కొంటున్న భక్తులు

» ఆలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భక్తుల వేడుకోలు

భిక్కనూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయంలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. ఎప్పు డు భక్తులతో కిటకిటలాడే ఈ ఆలయంలో నెలకొన్న సమస్యలతో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఆలయ పరిసరాలలోనే కోతులు తిష్ఠ వేయడంతో ఆలయానికి వచ్చే భక్తుల చేతుల్లో ఎలాంటి వస్తువులు, కొబ్బరికాయలు, పండ్లు ఉన్న లాక్కోని వెళ్లడంతో పాటుగా భక్తులపైకి దాడులకు పాల్పడుతున్నాయి. ప్రశాంతంగా స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఆలయంలోనికి వెళ్లాలంటే కోతుల మలమూత్రాలను దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆలయం చుట్టూ ప్రదక్షణ చేయాలంటే ముక్కులు మూసుకోవాల్సి వస్తుందని, ఆలయ పరిసరాలను ప్రతిరోజు సిబ్బంది ఎంత శుభ్రం చేస్తున్న వాటి నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయంలో మరుగుదొడ్లు సైతం సరిగా లేకపోవడం, సిబ్బంది మధ్య సఖ్యత లేకపోవడం, ఆలయానికి రావడానికి 44వ జాతీయరహదారి వద్ద రోడ్డుకు ఇరువైపుల ఉన్న సర్వీసు రోడ్లు అసంపూర్తిగా ఉండటం, ఎల్లమ్మ ఆలయం సమీపంలోని బ్రిడ్జిలో చిన్నపాటి వర్షానికే నీరు నిల్వడం, తదితర సమస్యలను పరిష్కరించే నాథుడే కరువయ్యారని, దేవాధాయ శాఖ అధికారులు హుండీ లెక్కింపు సమయంలో కానీ ఏదైనా ప్రత్యేక రోజుల్లో మాత్రమే ఈ ఆలయానికి వస్తున్నారని ప్రజలు, భక్తులు ఆరోపిస్తున్నారు. ఎంతో శ్రమకోర్చి స్వచ్ఛంధ సంస్థల సహకారంతో అప్పటి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆలయం ఎదురుగా ఉన్న కోనేరును బాగు చేయించినప్పటికీ ప్రస్తుతం దానిని పట్టించుకోకపోవడంతో చుట్టూ పిచ్చి చెట్లు మొలకెత్తి అధ్వానంగా తయారైంది.



ఆలయంలో కోతుల గుంపులు

● కోతుల మలమూత్ర విసర్జనతో కంపు కొడుతున్న ఆలయ పరిసరాలు..

ఆలయానికి రావాలంటే భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. రాత్రి నుంచి తెల్లవారుజామున వరకు కోతులు ఆలయ ప్రాంగణంలోని రేకుల షెడ్డు పైకప్పు కింద ఇనుప బొంగులపైన సేదతీరుతున్నాయి. దీంతో కోతుల మత,మూత్ర విసర్జనతో ఆలయ పరిసరాలు ముఖ్యంగా ఉదయం కంపుకొడుతున్నాయి. ఎక్కడెక్కడి నుంచో వస్తున్న భక్తులు ఉదయం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాలన్నా, స్వామివారి దర్శనానికి వెళ్లాలన్నా కోతుల మల మూత్రాలను దాటుకుంటూ ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. దర్శనానికి వచ్చే భక్తుల చేతుల్లో కొబ్బరికాయలు గానీ, పండ్లు గానీ, లడ్డూ ప్రసాదాలు కానీ కనిపిస్తే చాలు కోతులు లాక్కొని వెళ్తున్నాయి. వాటిని బెదిరించాలని చూస్తే మూకుమ్మడిగా దాడులు చేస్తున్నాయి. గతంలో ఈ కోతుల బెడద నుండి ఉపశమనం కోసం రెండు కొండెంగలను తీసుకురాగా ఒకటి విద్యుత్ షాక్‌తో మరణించగా, మరోకటి వెళ్లిపోయింది. అప్పటినుంచి ఈ కోతుల బెడద మరి ఎక్కువైంది.

● పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు

ఎంతో చరిత్ర కలిగిన సిద్ధరామేశ్వర ఆలయంలో సమస్యలు తాండవం చేస్తున్న పట్టించుకునే నాథుడు లేక భక్తులు సతమతమవుతున్నారు. సమస్యలపై ప్రజాప్రతినిధులను, అధికారులను ఎన్నిసార్లు కలిసి విన్నవించిన పరిష్కారం కావడం లేదని భక్తులు, గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కోతులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నామని, కోతుల మత, మూత్ర విసర్జన కారణంగా వచ్చే కంపు భరించలేకపోతున్నామని ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని భక్తులు, ఆలయ అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఈ ఆలయంలో నెలకొన్న పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని, కేవలం హుండీ లెక్కింపు సమయంలో, ఇతరాత్ర ముఖ్య దినాల్లో మాత్రమే ఆలయానికి అధికారులు వస్తున్నారని, స్థానిక మండల అధికారులు సైతం ఎప్పుడు ఆలయంలో నెలకొన్న సమస్యలపై పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఆలయాన్ని పట్టించుకుని ఆలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.



భిక్కనూరు సిద్ధరామేశ్వర ఆలయం

ఆలయంలో సమస్యల పరిష్కారానికి కృషి ..

దేవాదాయశాఖ ఏసీ విజయ రామరావు

సిద్ధరామేశ్వర ఆలయంలో కోతుల బెడదతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదు, వెంటనే కోతుల సమస్యను పరిష్కరించడానికి అటవీశాఖ అధికారుల సహకారం తీసుకోవడంతో పాటుగా కొండెంగల ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకుంటాం. ఆలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. ఆలయ సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలి.

పట్టణ ఆరోగ్య కేంద్ర నూతన వైద్యులకు శిక్షణ

సుభాష్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నూతనంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నియమితులైన పట్టణ ఆరోగ్య వైద్యులకు డీఎంహెచ్‌వో రాజశ్రీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో వైద్యాధికారులకు ఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారిణి రాజశ్రీ మాట్లాడుతూ పీహెచ్‌సీలో చేయవల్సిన పనులు, రికార్డులను మెయిన్‌టెన్ చేయడం, నేషనల్ హెల్త్ ప్రోగ్రాం ఏఎన్‌సీ నిర్వాహణ, కీటకజనిత వ్యాధులు, ఆరోగ్యశ్రీ, అసంక్రమిత వ్యాధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి తుకారం రాథోడ్, డాక్టర్ రాజు, డాక్టర్ సామ్రాట్ యాదవ్, డాక్టర్ సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వర ఆలయ నూతన పాలకమండలి

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నీలకంఠేశ్వర ఆలయ నూతన పాలక మండలిని శనివారం దేవాదాయ శాఖ నియమించింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ చైర్మన్‌గా సిరిగిరి తిరుపతి నియామకం కాగా డైరెక్టర్లుగా నందకిశోర్, మధన్‌మోహన్, వెంకట్‌రెడ్డి, కాటిపల్లి రాజు, నాగనాథ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, శంకర్, విజయరాణి, సత్యనారాయణ, క్రాంతికిరణ్, చంద్రకాంత్, నాగారావు, నర్సింగ్‌రావులను నియమించింది. పాలక మండలి త్వరలోనే ప్రమాణస్వీకారం చేయనున్నారు.

ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం విన్యాసాలు

సుభాష్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితుల్లో వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు మానవ ప్రమేయం లేకుండా రిమోట్ లైఫ్ జాకెట్‌తో వారిని ఒడ్డెకు ఎలా చేర్చాలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం జిల్లా కేంద్రంలోని రఘునాథ చెరువులో శిక్షణ నిర్వహించారు. ప్రమాదవశాత్తు వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా ఒడ్డెకు చేర్చేందుకు అగ్నిమాపక శాఖ అధికారులు రిమోట్ లైఫ్ జాకెట్‌ను అందుబాటులోకి తెచ్చారు. డీఎఫ్‌వో పరమేశ్వర్, ఎస్‌ఎఫ్‌వో ఆసం శంకర్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలో విద్యారంగం కుదేలు

సుభాష్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో విద్యారంగం కుదేలు అయ్యిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రచకొండ విఘ్నేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదుట విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా కార్యదర్శి రమేష్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్, ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత దీక్షను ప్రారంభించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 30న విద్యార్థిలోకంతో కలెక్టరేట్‌ను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఇందులో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సభ్యులు రాజ్‌కుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆజాద్, చక్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

సిరికొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి ప్రారంభమవుతున్న వినాయక ఉత్సవాలను మండల ప్రజలు శాంతి, సామరస్యంగా జరుపుకోవాలని తహసీల్దార్ రవీందర్‌రావు అన్నారు. తహసీల్దార్ కార్యలయంలో జరిగిన సమావేశానికి ఎంపీడీవో, ఎస్సై, ట్రాన్స్‌కో ఏఈ,సీహెచ్‌వో, నాయబ్ తహసీల్దార్,మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు, నీటి పారుదల శాఖ సిబ్బంది, ఎంఆర్‌ఐలు, పాల్గొన్నారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను ప్రజలు,యువకులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో మనోహర్‌రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బోర్గాం(పి) విద్యార్థులకు క్విజ్ పోటీలు

మోపాల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం బోర్గాం(పి) పాఠశాల విద్యార్థులకు జిల్లాస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. యూత్ ఫెస్ట్‌లో భాగంగా 9, 10వ తరగతి విద్యార్థులకు హెచ్‌ఐవి ఎయిడ్స్, టీబీ, బ్లడ్ డొనేషన్‌పై పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 5 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి జెడ్పీహెచ్ఎస్ ముబారక్‌నగర్ విద్యార్థినిలు దీక్షిత, గంగోత్రిలకు రూ.వెయ్యి నగదును అందజేశారు. ద్వితీయ స్థానంలో లావణ్య, ఫిర్దోస్‌లకు 500 రూపాయల నగదును ఇంచార్జి హెడ్‌మాస్టర్ శ్రీకాంత్ అందజేశారు. ఉమ్మడి జిల్లా నుండి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఈనెల 30న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డీహెచ్‌ఈ ఘన్సూర్ వెంకటేశ్వర్లు, డీపీఎం సుధాకర్, నవీన్, మోయిస్, స్రవంతి, స్నేహ, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సోషల్‌వర్క్‌లో ప్రగతికి పీహెచ్‌డీ ప్రదానం

డిచ్‌పల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్‌లో రీసెర్చ్ స్కాలర్ ప్రగతికి పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేశారు. రీసెర్చ్ సూపర్‌వైజర్ డాక్టర్ రాజేశ్వరి పర్యవేక్షణలో ఏ స్టడీ ఆన్ ఆటిట్యూడ్ ఎమాంగ్ స్టూడెంట్స్ టువార్డ్ హైయర్ ఎడ్యుకేషన్ అండ్ కెరీర్ ప్లానింగ్ ఇన్ కేజీబీవీస్ నిజామాబాద్ జిల్లా అనే అంశంపై రీసెర్చ్ స్కాలర్ సీహెచ్ ప్రగతి పరిశోధన చేశారు. శనివారం పీహెచ్‌డీ ఫైనల్ వైవా విజయవంతం కావడంతో ఉస్మానియా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ ప్రాన్సిస్ చంద్రశేఖర్, టీయూ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ పర్యవేక్షకులుగా హాజరై డాక్టరేట్‌ను ప్రకటించార

ఉత్తమ విదుర్థులకు నగదు పురస్కారం

ఇందల్వాయి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతిలో టాప్ మార్కులు సాధించిన రుచిత, దీపిక, శ్రీహిత ముగ్గురు విద్యార్థులకు ఎల్లారెడ్డి పల్లె మాజీ సర్పంచ్ మటములు శేఖర్, మనోహరాబాద్ మాజీ సర్పంచ్ పాటు కూరి తిరుపతిరెడ్డి తన సొంతంగా 10వ తరగతిలో అత్యధికంగా మార్కులు తెచ్చుకున్న ముగ్గురు విద్యార్థులకు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే సంవత్సరం ఇంకా అత్యధిక మార్కులు తెచ్చుకునిటైతే ఈ యొక్క ఆర్థిక సహాయము పెంచుతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు నాయుడి రాజన్న, శ్రీనివాస్, బాబు రావు, గ్రామస్తులు వీడిసి సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

దూర విద్యాలయలో ప్రవేశానికి దరఖాస్తులు

సుభాష్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి.రాంరెడ్డి దూరవిద్య కేంద్రం 2025-26 ప్రవేశ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. పీజీలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, డిగ్రీలో బీఏ, బీకాం, బీబీఏ, డిప్లొమాలో కంప్యూటర్ అప్లికేషన్, డాటా సైన్స్, వ్యాపార నిర్వాహణ, యోగాలో దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం 9912670252 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మహిళలకు ఉచిత శిక్షణ

డిచ్‌పల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28 నుండి మహిళలకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలర్ శిక్షణ 31 రోజులు, మగ్గం వర్క్ 31 రోజులు, బ్యూటీ పార్లర్ 35 రోజుల శిక్షణతో పాటు ఉచిత భోజన సదుపాయంతో పాటు హాస్టల్ వసతిని కల్పించడం జరుగుతుందని అన్నారు. 19-45ఏళ్ల వయస్సు కలిగి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంతానికి చెందిన అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. పూర్తి వివరాల కోసం 08461-295428 నెంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడి దాష్టీకం..

(5వ పేజీ తరువాయి....)

పరారైనాడు. ఆ టీచర్‌పై దాడి చేసేందుకు గ్రామస్థులు ప్రయత్నించగా తప్పించుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఆ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేయాలని గ్రామస్థులు పోలీసులను కోరారు. ఈ ఘటనపై మండల విద్యాధికారి అవదూత గంగాధర్ విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడు శంకర్‌ను సస్పెండ్ చేయాలని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవోను కోరారు.

అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలోనే పనులు

● రాష్ట్ర ఇంటర్‌బోర్డు జిల్లా ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న


మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు అధికారి

సుభాష్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ విద్య బలోపేతం చేపట్టడం కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కేటాయించిన నిధులను ఖర్చు చేయడం అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలోనే జరగాలని రాష్ట్ర ఇంటర్ బోర్డు జిల్లా ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న అన్నారు. శనివారం జిల్లా ఇంటర్ విద్యా కార్యాలయంలో జిల్లా అధికారి తిరుమలపుడి రవి కుమార్ అధ్యక్షతన జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ మరమ్మత్తుల పనులు, అభివృద్ధి పనులు చేపట్టడానికి ఇంటర్ బోర్డు కేటాయించిన నిధులను అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్, ప్రిన్సిపల్ జాయింట్ అకౌంట్ తెరవాలని తెలిపారు. మరమ్మతులు, అభివృద్ధి పనులు అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలోనే చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ ద్వారా ఆన్‌లైన్ అటెండెన్స్ విధానం అమలు చేయాలని ఆదేశించారు. కళాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. కళాశాలకు రాని విద్యార్థులను రప్పించేందుకు ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు కళాశాలకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 2025-26 విద్యాసంవత్సరంలో కళాశాలలో చేరిన విద్యార్థుల డేటాను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయడంతో పాటు విద్యార్థుల ఆపర్, పిన్ నెంబర్లను పూర్తి చేయాలని ఆదేశించారు. కళాశాలలో ఫిజిక్స్ ఆన్‌లైన్ తరగతులను తప్పకుండా నిర్వహించాలని అన్నారు. అన్ని కళాశాలలో విద్యార్థుల మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంచేందుకు వారంలో ఒకరోజు ఖచ్చితంగా క్రీడలను నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ విద్య అకాడమి సెల్ ప్రతినిధి నర్సయ్య, అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం జిల్లా ప్రత్యేక అధికారి ఒడ్డెన్న, డీఐఈవో రవికుమార్, నర్సయ్యలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల లెక్చరర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యాబోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర విటల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

● జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మోపాల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో రైతులు లాభాలు గడించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.గోవింద్ అన్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలోని ఆయిల్‌పామ్ వ్యవసాయ క్షేత్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పథకంలో ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ పంట సాగు అన్ని నేలలు అనుకూలంగా ఉంటాయని అన్నారు. ఆయిల్‌పామ్ పంట దిగుబడి 4 సంవత్సరాల నుంచి మొదలై 35 సంవత్సరాల వరకు ఉంటుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి రోహిత్, వ్యవసాయ మం డల అధికారి హీరాజాదవ్, ఏఈవోలు జ్ఞానేశ్వర్, స్వాతిలత, రైతులు ప్రతాప్‌రెడ్డి, కిరణ్‌కుమార్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.





నిజామాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయాల్లో నివాళ్లర్పిస్తున్న సీపీఐ, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు

సురవరం సుధాకర్ రెడ్డికి ఘన నివాళ్లు

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అఖిల భారత సీపీఐ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డికి సీపీఐ నాయకులు నివాళులర్పించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, నగర కార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్‌లో చేరి విద్యారంగ సమస్యలపై పోరాడి, యువజన కాంగ్రెస్ సమస్యలపై పోరాటాలు చేశారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి కార్యదర్శిగా ఉంటూ నల్గొండ పార్లమెంట్ సభ్యునిగా కొనసాగి ప్రజలకు సేవలు అందించారని అన్నారు. ఇందులో రఘురాం, రంజిత్, హన్మాండ్లు, సురేష్, అలీ, ఇమ్రాన్, ఫిరోజ్‌అలీ, కుశాల్, టోకు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో..

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు అని సీపీఐ(ఎ)ం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలతో ప్రజల పక్షాన నిలబడి జీవితాంతం పని చేశారని, అనేక పోరాటాలు నిర్వహించి సమస్యల సాధనకై కృషి చేశారన్నారు. కమ్యూనిస్టు పార్టీ విలువలకు కట్టుబడి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన చివరి వరకు మతోన్మాద పెట్టుబడిదారుల విధానానికి వ్యతిరేకంగా పనిచేశారని అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విఘ్నేష్, రాములు, రాజు, చక్రి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఒన్నాజిపేటలో గ్రామోత్సవం

ధర్పల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒన్నాజిపేట గ్రామంలో శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సాయి భక్తులు గ్రామోత్సవం కార్యక్రమాన్ని శనివారం సత్యసాయి సేవా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భజన, ఆధ్యాత్మిక ప్రసంగాలు, పల్లకిసేవా చేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరుగు పందెం, జ్ఞాపకశక్తి, మ్యూజికల్ చైర్, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేశారు. గ్రామంలోని సఫాయి సిబ్బందికి శాలువాలతో సన్మానించారు. గ్రామోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ ఈశ్వర్, ధర్పల్లి సత్య సాయి కమిటీ సభ్యుడు శంకర్, బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.


రోగులకు మందులను పంపిణీ చేస్తున్న ట్రస్టు చైర్మన్ కోనేరు శశాంక్

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం : కోనేరు

కోటగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కోనేరు చారిటబుల్ ట్రస్టు లక్ష్యమని ఎన్‌ఆర్‌ఐ, బాన్సువాడ బీజేపీ నాయకుడు కోనేరు శశాంక్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో కోనేరు చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో శనివారం మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మహిళలు, వృద్ధులు, సుమారు 200మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐ కోనేరు శశాంక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో మెగా హెల్త్‌క్యాంప్ నిర్వహిస్తామన్నారు. చాలా మంది పేదలు మెరుగైన వైద్య సేవలకు దూరంగా ఉన్నారన్నారు. స్థానికంగా ఆరోగ్య కేంద్రాల్లోనూ చికిత్సలు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కార్పొరేట్ స్థాయి వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా మరిన్ని వైద్య సేవలు అందించేలా తమ ట్రస్టు కృషి చేస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో బీజేపీ నాయకులు నవీన్, ప్రకాష్ పటేల్, మోహన్ రావు, శ్యామల, శ్రీనివాస్, శ్యామ్, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

'ఛీ'ఎంసీ..

(5వ పేజీ తరువాయి...)

చైర్మన్ షన్ముకలింగం చెబుతుండగా తాను పెట్టుబడి పెట్టినట్లు అజ్జ శ్రీనివాస్ చెబుతున్నారు.

ఐఎంఎస్‌ఆర్ చైర్మన్ షన్ముకలింగం ఎలాగైనా కళాశాలను ప్రారంభిస్తానని చెబుతుండగా వారికి తెలియకుండా 10 శాతం పెట్టుబడి పెట్టినట్లు సీఎస్‌ఐ పాలకమండలి నియమించిన డైరెక్టర్ అజ్జ శ్రీనివాస్ ప్రకటించడం రోజురోజుకు వివాదాస్పదమవుతుంది. అసలు కళాశాలలో మెడికల్ కళాశాల ప్రారంభించేందుకు సరైన వసతులు ఉన్నాయా? లేవా? అనేది తెలియాల్సి ఉంది. కళాశాలను తిరిగి ప్రారంభించాలంటే ఎన్‌ఎంసీ మార్గదర్శకాల ప్రకారం భవనాలు, ఫర్నీచర్, ల్యాబ్‌లు, లైబ్రరీ, హాస్టల్, బోధన సిబ్బంది తప్పని సరిగా ఉండాలి. కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అఫిలియేషన్ అవసరం. మెడికల్ కళాశాల పునఃప్రారంభానికి అనేక ప్రక్రియలు ఉండగా మొదట్లోనే వివాదాస్పదం కావడం కళాశాల ప్రారంభంపై నీలినీడలు అలుముకుంటున్నాయి.

రావొద్దు...

● సీఎంసీ చైర్మన్‌ను, డైరెక్టర్‌ను అడ్డుకున్న సిబ్బంది

● గేట్లు మూసివేసి సిబ్బంది నిరసన

డిచ్‌పల్లి: సీఎంసీ ఆస్పత్రి వ్యవహారం చివికి చివికి గాలివానలా మారింది. శనివారం చైర్మన్ హోదాలో ఆస్పత్రికి వచ్చిన షన్ముకలింగం, డైరెక్టర్ జేఎస్ రావు ను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకొని గేట్లు తీయబోమని స్పష్టం చేశారు. తాము చైర్మన్, డైరెక్టర్ హోదాలో వస్తే తమనే అడ్డుకుంటారా అని తాము తలుచుకుంటే గేటు తాళాలు పగలగొడతామని అన్నా సిబ్బంది మాత్రం వినిపించుకోలేదు. విషయం తెలుసుకున్న డిచ్‌పల్లి ఎస్‌ఐ ఎండీ షరీఫ్ అక్కడికి చేరుకొని చైర్మన్, డైరెక్టర్లతో మాట్లాడి ఇట్టి విషయాన్ని న్యాయపరంగా చూసుకోవాలని సూచించారు. దీంతో వారు చేసేదేమీ లేక వెనుదిరిగారు.

తొర్లికొండలో వేంకటేశుడికి పల్లకి సేవ

5వ పేజీ తరువాయి...

జక్రాన్‌పల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని కొండపై చుట్టు ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

జాన్కంపేట ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఎడపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేట గ్రామ శివారులో గల లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శనివారం అమావాస్య కావడంతో అమావాస్యను పురష్కరించుకుని అష్టముఖి కోనేటిలో స్నానమాచరించడానికి జిల్లా నలుమాలల నుండే సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చారు.

'పైసా'చికం...

(5వ పేజీ తరువాయి...)

నిరోధక చట్టం, ఐపీసీ సెక్షన్‌లు (384, 420, 506) కింద కేసులు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. వడ్డీ వ్యాపారులపై పీడియాక్ట్ నమోదు చేసే అవకాశం కూడా ఉంది. గ్రామస్థాయిలో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి వడ్డీ వ్యాపారులపై పోలీసులకు సమాచారం ఇచ్చేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వడ్డీ వ్యాపారుల వేధింపుల వల్ల బెదిరింపులు ఎదుర్కొంటున్న బాధితులకు, ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు పోలీసులు ప్రత్యక్షంగా సహకారం అందిస్తే కొంతవరకైనా వడ్డీ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. జిల్లాలో రూ. 20కోట్ల వరకు ప్రతీనెలా వడ్డీ వ్యాపారం జరుగుతోంది. నిజామాబాద్ నగరంలోనే సుమారు రూ.10 కోట్ల టర్నోవర్ వడ్డీ వ్యాపారం ద్వారా జరుగుతున్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో అనేక ఘటనలు...

అవసరాలకు అప్పు తీసుకొని తర్వాత అప్పు చెల్లించలేక, వడ్డీ వ్యాపారస్తుల వేధింపులతో సమాజంలో అవమాన భారంతో అనేక మంది ఆత్మ హత్యలు చేసుకుంటున్న ఘటనలు ఉన్నాయి. నిజామాబాద్ నగరంలోని గంగాస్థాన్‌లో నివాసం ఉండే ఓ కుటుంబం వడ్డీ వ్యాపారుల వేధింపులతో గతంలో విజయవాడలోని కృష్ణానదిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. అదే విధంగా నగరంలోని కపిల హోటల్‌లో ఓ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. నగరానికి చెందిన ఓ బీజేపీ నాయకుడి వేధింపులకు తండ్రి, కూతురు గోదావరి నదిలో ఆత్మహత్యకు ప్రయత్నించగా తండ్రి మృతి చెందగా, కూతురిని స్థానికులు కాపాడిన ఘటన ఆరు నెలల క్రితం జరిగింది. ఇలా వడ్డీ వ్యాపారుల ఆగడాలకు జిల్లాలో అనేక మంది బలవుతున్నారు. 3 నుంచి రూ.10 వరకు అవసరాన్ని బట్టి వడ్డీ వ్యాపారులు వడ్డీ వసూలు చేస్తూ అప్పు తీసుకున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. జిల్లాలో వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న వారంతా ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగులే ఉంటున్నా రు. ఉపాధ్యాయులతో పాటు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది వడ్డీ వ్యాపారాలను అనధికారికంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిజామాబాద్ రూర ల్ పోలీస్ స్టేషన్‌లో గంగాధర్ అనే కానిస్టేబుల్‌పై అధిక వడ్డీ వసూలు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నట్లు ఇటీవల కేసునమోదు కావడం గమనార్హం.

(5వ పేజీ తరువాయి...)

సడన్ ఎంట్రీ..

● మోపాల్, ముదక్‌పల్లిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మోపాల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మోపాల్, ముదక్‌పల్లిలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముదక్ పల్లి గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని, మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. మోపాల్, ముదక్‌పల్లి హాస్టళ్లను తనిఖీ చేసి విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు రాత్రి భోజనంలో అందించిన ఆహార పదార్థాలు మెనూకు అనుగుణంగా ఉన్నాయా అని పరిశీలించారు. భోజనం సక్రమంగా అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్, కిచెన్, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసి వార్డెన్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, ప్రతిరోజు ఫేస్ రికగ్నిషన్ ద్వారా వంద శాతం హాజరు నమోదు జరగాలని అన్నారు. వసతి గృహాలలో అందుబాటులో ఉన్న తాగునీరు, టాయిలెట్స్ తదితర సదుపాయాలు పరిశీలించి ఏమైనా సౌకర్యాలు అవసరం ఉన్నాయా అని ఆరా తీశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. అంతకుముందు కలెక్టర్ మోపాల్ ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్ల గురించి ఎంపీడీవో రాములు నాయక్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాను పరిశీలించి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా పరిశీలన చేయాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేలా సన్నద్ధమై ఉండాలని అన్నారు.

పింఛన్‌లు పెంచకపోతే సీఎం రాజీనామా చేయాలి

(5వ పేజీ తరువాయి....)

ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చేయూత పింఛన్ పెంపు సన్నాహక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రకటనలకే పరిమితమవుతుందని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు అవుతున్నా.. పింఛన్‌లు పెంచకపోవడం సరి కాదన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష నాయకుడు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కే పరిమితమవుతూ ప్రజల పక్షాన నిలబడకుండా నిర్లక్ష్యానికి పోతున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో సెప్టెంబరు 9న జరిగే పింఛన్‌ల పెంపు మహాసభకు పింఛన్‌లపై ఆధారపడి జీవించే ప్రతిఒక్కరు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బీరప్ప, ఉపాధ్యక్షుడు సలీం, మహిళ అధ్యక్షురాలు శివకాంత, వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు సతీష్, చంద్రకళ, సఫియా బేగం, సాయిలు, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాకు రానున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

(5వ పేజీ తరువాయి...)

రక్తదాన శిబిరంతో పాటు తన సొంత డబ్బులతో ఎంపీ బూత్ స్థాయి కార్యకర్తలకు రోడ్డు ప్రమాదాలు, మృతి చెందిన వారికి, గృహప్రవేశాలు, పెళ్లిళ్లు చేసుకున్న వారికి ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. మృతి చెందిన బూత్‌స్థాయి కార్యకర్తల కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయంతో పాటు గృహప్రవేశాలకు, పెళ్లిళ్లు చేసుకున్న వారికి 20వేల ఆర్థిక సహాయం, ప్రమాదాల బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి ఆసుపత్రి బిల్లులను బట్టి ఆర్థిక సహాయం అందించనున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 70 మందికి పైగా కార్యకర్తలకు ఆర్థిక సహాయం అందించనున్నారు. అనంతరం కార్యకర్తల సమక్షంలోనే ఎంపీ అర్వింద్ జన్మదిన వేడుకలు నిర్వహించనున్నారు.

సినిమా గైడ్

దేవి : మహావతార నరసింహా (3డి తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కూలీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : పరదా (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : వార్-2 (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : మేఘాలు చెప్పిన ప్రేమ కథ (11.00)
: కూలీ (1.20, 4.30, 10.20)
: యూనివర్సిటీ పేపర్ లీక్ (7.40)
స్క్రీన్-2 : పరదా (11.00, 4.40, 10.40)
: వార్-2 (తెలుగు) (1.30, 7.25)
స్క్రీన్-3 : యూనివర్సిటీ పేపర్ లీక్ (1.40)
: మహావతార్ నరసింహా (4.30, 7.30)
: మేఘాలు చెప్పిన ప్రేమ కథ (10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : మహావతార నరసింహా (11.00, 1.50, 4.40)
: పరదా (7.30)
: వార్-2 (10.30)
స్క్రీన్-2 : కూలీ (10.00)
: పరదా (1.30)
: వార్-2 (4.30)
: మహావతార నరసింహా (8.05, 10.55)
స్క్రీన్-3 : వార్-2 (హిందీ) (11.15, 2.50, 6.25, 10.00)
స్క్రీన్-4 : బన్ బటర్ జామ్ (10.10)
: మేఘాలు చెప్పిన ప్రేమ కథ (1.15)
: పరదా (4.20), కూలీ (7.20, 10.50)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.101,600	రూ.93,800	రూ.1200

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.150	రూ.225	రూ. 245

